
సాక్షి
గుంటూరు
గురువారం । 16 । జనవరి । 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 564.70 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన తంబి మహోత్సవాలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలు బుధవారం ముగిశాయి.

న్యూస్‌రీల్

17న కౌన్సిల్ సమావేశం నిర్వహించండి

గుంటూరు కమిషనర్‌కు మేయర్ మనోహర్‌నాయుడు లేఖ

నెహ్రూ నగర్(గుంటూరు ఈస్ట్): నగర సమగ్రాభివృద్ధి దృష్ట్యా, ప్రజా ప్రయోజనాల నిమిత్తం ఈనెల 17న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు బుధవారం లేఖ రాశారు. ఈనెల 4న జరిగిన నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో కమిషనర్ వ్యవహరించిన తీరును లేఖలో మేయర్ తప్పుబట్టారు. ప్రజా ప్రతినిధులపై కక్ష సాధింపు చర్యలు బాధాకరమని పేర్కొన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తగవని హితవుపలికారు. ఐఏఎస్‌ల లక్ష్యం ప్రజాశ్రేయస్సే కావాలని, ఇప్పటికైనా నియంతృత్వ పోకడలు వీడి కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని కోరారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు, 46వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని, మేయరైన తనకు కనీస సమాచారం లేకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రజలు ఎన్నుకున్న మేయర్‌ను అవమానించడం పరోక్షంగా ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మనోహర్ ఘాటుగా స్పందించారు. నగరపాలకసంస్థ అభివృద్ధి దృష్ట్యా సంయమనం పాటిస్తున్నామని ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ చట్టం–1955లోని సెక్షన్ 88సీ , పేజీ నంబర్ 135 ప్రకారం ఈనెల 17న కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

మహంకాళి దేవస్థానానికి రూ.లక్ష విరాళం



తాడేపల్లిరూరల్: కంతంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాత మంగళవారం 1,00,116 అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి గుంటూరు వాస్తవ్యులు మునగాల సత్యనారాయణ రెడ్డి, బంగారం దంపతులు ఈ విరాళాన్ని అందజేశారని వివరించారు. అనంతరం సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని వివరించారు.

అడుసుమల్లికి తెలుగు కీర్తి జాతీయ పురస్కారం



బాపట్ల: బాపట్లకు చెందిన అడుసుమల్లి మల్లికార్జునకు తెలుగు కీర్తి జాతీయ పురస్కారం దక్కింది. ట్రాన్స్‌కో ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన అడుసుమల్లి రచయితగా, సాహితీవేత్తగా పలు రచనలు చేశారు. ప్రస్తుతం విశ్రాంత జీవితంతోనూ రచనలుచేస్తున్నారు. ఆయన సాహిత్య సేవను గుర్తించిన శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ తదితర సంస్థలు సంయుక్తంగా తెలుగుకీర్తి అవార్డును ప్రకటించాయి. ఈనెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో అడుసుమల్లి ఈ పురస్కారన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు, సాహితీ మిత్రులు సాయిబాబు, లైబ్రరియన్ శివాజీ గణేషన్, ఏపీ ట్రాన్స్‌కో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ ఆలపర్తి నారాయణస్వామి తదితరులు అడుసుమల్లికి అభినందనలు తెలిపారు.

కవి జయరాజు రచనలు అభినందనీయం



పొన్నూరు: అంబేడ్కరిజాన్ని మార్క్సిజాన్ని సమన్వయించి పాటలు రాసి, పాడుతూ సమాజాన్ని ఉత్తేజపరుస్తున్న తెలంగాణ కవి జయరాజు అభినందనీయులని ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు కొనియాడారు. మంగళవారం పట్టణంలోని లుంబినీవనంలో కత్తి పద్మారావును జయరాజు తన సతీమణి మంగతాయారు, కుమారుడు రమణతోపాటు కలిశారు. ఈ సందర్భంగా జయరాజు రచించిన పుస్తకాలను పద్మారావుకు అందించి పాటలు ఆలపించారు. పద్మారావు తాను రచించిన భారతదేశ చరిత్ర పుస్తకాన్ని జయరాజుకు అందించారు. అనంతరం జయరాజు కుటుంబ సభ్యులను పద్మారావు సన్మానించారు. కార్యక్రమంలో కత్తి స్వర్ణ కుమారి, దాసరి శ్యామల, రాణి, కత్తి లోకాయత్, హేమ పాల్గొన్నారు.

బలుపు కనబరిచి..!

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో యథేచ్ఛగా కోడి పందేల బరులు
- టీడీపీ నేతల ఆధ్వర్యంలో సకల వసతులతో నిర్వహణ
- జోరుగా గుండాట, కోత ముక్కలాట
- భారీగా చేతులు మారిన నగదు
- ఏరులై పారిన మద్యం
- పోలీసులు ధ్వంసం చేసిన చోటే పందేలు
- అడ్డుకోవడంలో ఘోరంగా విఫలమైన పోలీసులు
- పల్నాడులో ఎస్పీ కార్యాలయం ఉన్న రూరల్ మండలంలోనూ పందేలు

రెచ్చిపోయిన టీడీపీ నేతలు



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో కోడి పందేలను ప్రారంభిస్తున్న మాజీమంత్రి ఆలపాటి

తెనాలి/ తాడికొండ/సాక్షి, నరసరావుపేట : సంక్రాంతి పండగ వేళ ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ నేతలు బరి తెగించారు. నిషేధం ఉన్నా.. యథేచ్ఛగా బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించారు. బరుల వద్ద టీడీపీ ఫ్లెక్సీలు, జెండాలను ఏర్పాటు చేసి స్వాగతం పలకడం విశేషం. బరుల వద్ద కోట్ల రూపాయలు చేతులు మారాయి. జూదానికి బానిసైన వారు మూడు రోజుల్లో జోరుగా పందేలు కాసి పెద్ద మొత్తంలో నగదును కోల్పోయారు. ముక్క నుంచి చుక్క దాకా సకల సౌకర్యాలు బరుల వద్ద నిర్వాహకులు జూదరులకు అందించారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలోనే బరుల వద్ద బెల్టుషాపుల నిర్వహణకు వేలం పాట నిర్వహించారు. హెచ్చు పాట పాడిన వారు తాత్కాలిక బెల్టుషాపులను ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరిపారు. బరులకు స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంక్రాంతి పండుగ మూడు రోజలపాటు పగలు రాత్రి తేడా లేకుండా పందేం కోళ్ల కాళ్లదువ్వాయి. అధికారపార్టీ ఒత్తిడితోనో, లేక బరుల నిర్వాహకులు ఇచ్చిన మామూళ్ల వల్లో తెలియదు గానీ పోలీసులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు.



కొనకంచివారిపాలెంలో బరి వద్ద వాహనాలు

కొల్లిపరలో వికటట్టహాసం

అధికారుల హెచ్చరికలు బీరాలను తలపించాయి. పందెంకోళ్లు వికటాట్టహాసం చేశాయి. కత్తుల కాళ్లతో యథేచ్ఛగా తలపడ్డాయి. రూ.వేలూ.. రూ.లక్షలూ జూదరుల చేతులు మారాయి. సందర్శకులతో కోడిపందేల బరి కోలాహలంగా మారింది. కొల్లిపర మండల గ్రామం బొమ్మువానిపాలెం సమీపంలోని కృష్ణా కరకట్ట వేదికగా కోడిపందేలు యథాతథంగా జరిగాయి. కోడిపందేలను నిషేధించామని హెచ్చరికలుచేస్తూ, అక్కడ ఏర్పాటుచేసిన బరిని పోలీసులు ట్రాక్టరుతో దున్నించి ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ముందస్తు జాగ్రత్తగా బయట పోలీసులను దింపి, గ్రామాల్లో పహారా కాయించారు. అయినప్పటికీ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం సాయంత్రం అక్కడకు వెళ్లి స్వయంగా కోడిపందేలను ప్రారంభించారు. అక్కడి నుంచి పందేలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. తిరిగి బుధవారం కూడా కోడిపందేలు నిర్వహించారు. గురువారం కూడా పందేలు ఉంటాయని జూదరులు బహిరంగంగా చెబుతున్నారు.



పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కొనకంచి వారిపాలెంలో కాలుదువ్విన కోళ్లు

తాడికొండ మండలంలో బరితెగింపు

సంక్రాంతి సంబరాల పేరిట టీడీపీ నాయకులు కోడి పందేలు, పేకాట నిర్వహించి యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించారు. తాడికొండ మండలం నిడుముక్కల, మోతడక గ్రామాల్లో బహిరంగంగా బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు, పేకాట, నంబర్లాట నిర్వహించారు. నిబంధనల ప్రకారం కత్తులు కట్టిన కోడి పందేలు నిర్వహించకూడదని పోలీసులు చెబుతున్నా నిబంధనలేమీ నిర్వాహకులు పట్టించుకోలేదు. టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరిగిన ఈ తంతువైపు పోలీసులు తొంగిచూసిన దాఖలాలే లేవు.

చేతులెత్తేసిన పోలీసు శాఖ

సంక్రాంతి పండగకు రెండుమూడు రోజుల ముందు నుంచి పల్నాడు జిల్లా పోలీసుశాఖ కోడిపందేలు జరగడానికి వీలులేదని, జరిగితే కఠినమైన చర్యలు ఉంటాయని నానా హడావుడి చేశారు. అన్ని స్టేషన్‌ల నుంచి మీడియాకు హెచ్చరికలతో కూడిన ప్రకటనలు విడుదల చేయించారు. కొన్ని ప్రాంతాలలో ఏర్పాటుచేసిన బరులను ధ్వంసం కూడా చేశారు. డ్రోన్‌లను ఉపయోగించి జిల్లాలో ఏమారుమూల పల్లెలో కోడిపందేలు జరిగినా క్షణాల్లో తెలుసుకుంటామని గొప్పలు చెప్పారు. ఇందులో భాగంగా నరసరావుపేట పట్టణ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్లను ఎగురవేసి హంగామా చేశారు. తీరా భోగి పండుగ వచ్చేసరికి పోలీసులు పత్తాలేకుండా పోయారు. బరుల వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. బరుల సమాచారం జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తెలిసినా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. మారుమూల ప్రాంతాలు దేవుడికెరుక పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం ఉన్న నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జోరుగా కోడిపందేలు జరిగినా ఒక్క డ్రోన్ ఎగిరిన పాపానపోలేదు. గతంలో ఎక్కడో పొలాలు, గుట్టల కింద గుట్టుగా జరిగే వ్యవహారం ఈ ఏడాది ప్రధాన రహదారుల వెంబడే యథేచ్ఛగా జరగడం కొసమెరుపు. గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో పల్నాడు ప్రాంతంలో కోడిపందేల నిర్వహణపై అప్పటి పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపారు. ప్రత్యేకంగా పల్నాడు జిల్లా ఏర్పాటైన తరువాత అధికార యంత్రాంగం మొత్తం నరసరావుపేట చేరుకున్నా అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు. అక్రమార్కులు బరితెగించి బరులు ఏర్పాటు చేసినా పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం ఆ శాఖ పనితీరుపై విమర్శలొస్తున్నాయి. పందెంలో ఓడిన కోళ్లను బరుల నిర్వాహకులు పోలీసు అధికారులకు పంపిచారంటే వారికి అధికారుల నుంచి ఏ స్థాయిలో సహకారం ఉందో అర్థం చేసుకోవచ్చు.

సీఐ సుబ్బానాయుడికి బెస్ట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అవార్డు



నాదెండ్ల: పల్నాడు జిల్లా పరిధిలో బెస్ట్ ఇన్వెస్టిగేషన్ పోలీసు అధికారిగా చిలకలూరిపేట రూరల్ సీఐ బత్తిన సుబ్బానాయుడు అవార్డు అందుకున్నారు. చిలకలూరిపేట రూరల్ పరిధిలో నమోదైన కేసుల్లో చురుకైన దర్యాప్తు చేసి దోషులను పట్టుకోవటం, చోరీ సొత్తు రికవరీ చేయటం, బాధితులకు అప్పగించటంలో చూపిన ప్రతిభకు ఈ అవార్డు దక్కింది. పల్నాడు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, డీఎస్పీ నాగేశ్వరరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులతో కలిసి సీఐ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు, పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించారు.

జన సందోహం 'కనుమా'..!



నరసరావుపేట: ప్రజలు గురువారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత వేకువనే పల్లెటూళ్లలో తమ ఇళ్లలోని పశువులకు పసుపు, కుంకుమలతో రంగులు పూసి పూజలు చేశారు. కనుమ నాడు మాంసం తినే సంప్రదాయం ఉండడంతో మాంసం దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. వేట మాంసం, బ్రాయిలర్, నాటు, గిరిరాజా కోడి మాంసాలకు గిరాకీ ఏర్పడింది. నరసరావుపేట పట్టణంలోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వేట మాంసం కేజీ రూ.900లకు పైగా ధర పలకగా చికెన్ ధర రూ.240పైగా పలికింది. గిరిరాజా కోడి మాంసం ధర రూ.550, నాటుకోడి కేజీ రూ.750 పలికింది.

ఆనంద ల'హరి'



నిజాంపట్నం కాలువలో శ్రీవారి తెప్పోత్సవం

వైభవంగా వైకుంఠపురవాసుని తెప్పోత్సవం

తెనాలి: వైకుంఠపురంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ పద్మావతీసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రీవారి తెప్పోత్సవం భక్తజన సందోహం నడుమ వైభవంగా జరిగింది. ఏటా మకర సంక్రాంతి పండగ రోజున స్వామి తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం ఐదు గంటలకు స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఆలయం వద్ద నుంచి అధికారులు ఊరేగింపుగా వెలుపలికి తీసుకొచ్చారు. నిజాంపట్నం కాలువలో ముత్యంశెట్టిపాలెం వంతెన వద్ద ప్రత్యేకంగా అలంకరించిన విద్యుద్దీపాలతో కూడిన హంస వాహన పడవలో స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులను ఉంచారు. అర్చకులు రత్నాకరం సత్యనారాయణ గౌతమ, అళహరి రవికుమార్‌లు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణలు విశేష పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, పాలకవర్గ సభ్యులు నేతృత్వంలో అర్చకులు పూజలు జరిపించారు. ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొబ్బరికాయ కొట్టి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలో పాల్గొని స్వామిని దర్శించుకోవటం తన అదృష్టమన్నారు. ఏటా స్వామి తెప్పోత్సవం వైభవంగా జరుగుతుందని, పట్టణంలో మూడు కాల్వలు ఉండటం, పడవలో స్వామి ఉత్సవం జరగటం తెనాలికి ప్రత్యేక ఆకర్షణగా చెప్పారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు సాయంత్రం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ముత్యంశెట్టిపాలెం వంతెన వద్దకు చేరుకున్నారు. పడవలో ఓవైపు స్వామి అమ్మవార్లు కూర్చుని తెప్పోత్సవంలో విహరిస్తుండగా, మరో వైపు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ నర్తకి, నృత్యగురువు ఆరాధ్యుల తేజస్విప్రఖ్య బృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. తెప్పోత్సవం అక్కడ్నుంచి బయలుదేరి కొత్త వంతెన, మార్కెట్ వంతెన, గంగానమ్మపేట వంతెన వరకూ కొనసాగింది. దారి పొడవునా కాలువకు ఇరువైపులా జక్తజనం నిలబడి భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవాన్ని వీక్షించారు. ట్రాఫిక్‌పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణులు



ఉత్సవాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్


నేటి నుంచి మిర్చి యార్డులో క్రయవిక్రయాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో గురువారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరపనున్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు, సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండగలను పురష్కరించుకుని ఐదు రోజులు యార్డుకు సెలవులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. గురువారం నుంచి రైతులు తమ సరుకును యార్డుకు తీసుకు వచ్చి విక్రయించుకోవచ్చని ఆయన వివరించారు.

తెనాలి రజకచెరువు కూడలిలో తీవ్ర ఉద్రిక్తత

- భోగి రోజున అర్ధరాత్రి అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట
- మరుసటి రోజు 163 సెక్షన్ నిషేధాజ్ఞల ప్రకటన
- విగ్రహం తొలగిస్తారనే సమాచారంతో వందలాదిగా అక్కడికి చేరుకుని దళితుల ఆందోళన
- యథాతథ స్థితిని కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్ హామీ
- విశ్వసించని కమిటీ నేతలు 'చలో తెనాలి' పిలుపు
- అధికారుల చర్చల్లో స్పష్టమైన హామీతో కార్యక్రమ విరమణ



విగ్రహం వద్దకు వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిరూరల్: సంక్రాంతి పండగ రోజున తెనాలిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రజక చెరువు కూడలిలో అర్ధరాత్రి ప్రతిష్ఠించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగిచేందుకు అధికారులు సన్నాహాలు చేసిన నేపథ్యంలో వందల సంఖ్యలో దళితులు పట్టణ రజక చెరువు కూడలి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి కూడలిలో రాకపోకలను నిలిపివేసి రాత్రి రెండు గంటల వరకు ఆందోళన కొనసాగించారు. 'చలో తెనాలి'కి పిలుపునిచ్చారు. విగ్రహాన్ని తొలగింపబోమంటూ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆ పిలుపును రద్దుచేసుకున్నారు.

అసలేం జరిగిందంటే..

పట్టణ రజక చెరువు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు 1996లోనే కమిటీగా ఏర్పాటై ప్రయత్నాలు ప్రారంభించారు. అనుమతుల మంజూరు కోసం ఏళ్లతరబడి అధికారుల చుట్టూ తిరిగారు. పాత పార్లమెంటు ఆకారంలో భవనాన్ని నిర్మించి, అంబేడ్కర్ నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కార్యక్రమాలను చేపట్టారు. పాత పార్లమెంటు భవన ఆకృతి వరకు నిర్మాణం చేశారు. భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో రజకచెరువు కూడలిలో పాత పార్లమెంటు భవన ఆకృతి కట్టడాన్ని తొలగించేందుకు అధికారులు సిద్ధపడుతున్నారని విగ్రహ కమిటీ సభ్యులకు ఉప్పందింది. దీంతో ఈ నెల 7న భవనం నడుమ ప్రదేశంలో దిమ్మె నిర్మించి, చిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవని పోలీసులు అడ్డుకోబోయారు. ఆ రోజు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. చివరకు దిమ్మె నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తిరిగి భోగి పండుగ రోజున అర్ధరాత్రి క్రేన్ సహాయంతో మరో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని తీసుకొచ్చారు. పాత పార్లమెంటు నమూనా భవనంపై ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ మరుసటి రోజునే తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పట్టణ, పరిసరాల్లో 163 సెక్షన్ నిషేధాజ్ఞలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దాదాపు నెలరోజులపాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

నాలుగు గంటలకుపైగా ఆందోళన

ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహంతో సహా భవనాన్ని తొలగించాలనే ఉద్దేశంతో ముందస్తుగా నిషేధాజ్ఞలను విధించిందని విగ్రహ కమిటీకి సమాచారం చేరింది. అక్కడ గొడవలు జరిగే ఆస్కారం ఉందన్న పోలీసుల సూచనపై నిషేధాజ్ఞలు ఇచ్చినట్టుగా అధికారులు వెల్లడిస్తున్నారు. ఏదేమైనా విగ్రహ తొలగింపును అడ్డుకోవాలని కమిటీ సభ్యులు ఇచ్చిన పిలుపుతో మంగళవారం రాత్రి రజకచెరువు కూడలికి భారీగా ప్రజలు తరలివచ్చారు. మహిళలూ వందలాది మంది తరలిరావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నాలుగు గంటలకుపైగా ఆందోళన కొనసాగింది.

మున్సిపల్ కమిషనర్ చెప్పినా..!

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఘటనస్థలానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. యథాతథ స్థితిని కొనసాగిస్తామని ఆయన చెప్పినా, ఆందోళన విరమణకు దళితులుససేమిరా అన్నారు. విగ్రహాన్ని తొలగించబోమని తమకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళనను విరమించేది లేదని తేల్చి చెప్పారు. 16వ తేదీ సాయంత్రం చలో తెనాలికి పిలుపునిచ్చారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు నచ్చచెప్పినా ఫలితం లేకపోవటంతో అధికారులు చేసేది లేక తిరిగి వెళ్లారు. బుధవారం ఉదయం అధికారులు విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులతో చర్చలు జరిపారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ బి.జనార్దనరావు వారితో మాట్లాడారు. విగ్రహాన్ని తొలగించబోమని స్పష్టమైన హామీనిచ్చారు. దీంతో విగ్రహ కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆందోళనను విరమిస్తున్నట్టు ప్రకటించారు. చలో తెనాలి కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటున్నట్టు వెల్లడించారు.



అధికారులతో చర్చలు జరిపి వినతిపత్రం అందజేస్తున్న విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు

చదరంగంలో చిన్నారికి అంతర్జాతీయ ఫిడే రేటింగ్



మాచర్ల రూరల్: మాచర్లకు చెందిన చదరంగం బాల క్రీడాకారుడు జాషువా మాగ్నస్ అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌లో 1,413 పాయింట్లను సాధించి సత్తాచాటాడు. గత ఏడాది మైసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి టోర్నీలో, భీమవరంలో జరిగిన టోర్నీలో పాల్గొని నలుగురు క్రీడాకారులను ఓడించడం ద్వారా ఈ రేటింగ్ సాధించాడు. ఆరేళ్ల వయసు విభాగంలో మాగ్నస్ ఈ ఘనత సాధించడం విశేషం. పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్‌తోపాటు పలువురు మాగ్నస్‌ను అభినందించారు.

అమరేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

అమరావతి: అమరేశ్వరస్వామి ఆలయంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం పండగ సేవ నిర్వహించారు. బుధవారం కనుమ సందర్భంగా గోపూజ చేశారు. స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పేరంటం నిర్వహించారు. వేదపండితులు తొలుత అమరేశ్వరుని శేష వస్త్రాన్ని గోమాతకు సమర్పించి పసుపు కుంకుమలు, పూలమాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమరేశ్వరునికి పండగ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



వేటపాలెం: సంక్రాంతి పురస్కరించుకొని రెడ్డి జన సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని శ్రీనగర్ కాలనీ రెండో వీధిలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి, ప్రముఖ యాంకర్ ఆరే శ్యామల రెడ్డి, ప్రసన్న, రమాదేవి న్యాయనిర్ణేతలగా వ్యవహరించారు. పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందించారు. రెడ్డి జన సంఘ సభ్యులు, రెడ్డి జన సేవా సంఘ ప్రెసిడెంట్ జి. అనిల్ కుమార్ రెడ్డి, సెక్రటరీ బి. జయ భారత రెడ్డి, ట్రెజరర్ బి. వెంకటేశ్వర్ రెడ్డి, బత్తుల బ్రహ్మారెడ్డి, శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

24న చేనేత కార్మికుల ధర్నా



భట్టిప్రోలు (కొల్లూరు): చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ కోరారు. భట్టిప్రోలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ధర్నా కరపత్రాలను నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగంలో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న చీరాలలోని చేనేత, జౌళీ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 15 డిమాండ్లను పరిష్కరించాలని ఆయన విన్నవించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, గోపాలస్వామి, పోలిశెట్టి శంకరరావు పాల్గొన్నారు.

కుర్చీలాట ఆడుతూ.. కుప్పకూలి..

- మ్యాజికల్ చైర్స్ ఆడుతూ కుప్పకూలిన మహిళ
- చికిత్సకోసం తరలిస్తుండగా మృతి



మృతురాలు రాజ్యలక్ష్మి (ఫైల్)

ఫిరంగిపురం: సంక్రాంతి సంబరాల సందర్భంగా ఏర్పాటు చేసిన కుర్చీలాట పోటీల్లో పాల్గొన్న మహిళ ఆటఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలి కొంతసేపటిలో మృతిచెందిన సంఘటన మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. సంక్రాంతి సంబరాల సందర్భంగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పలు రకాల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. కాగా గ్రామానికి చెందిన కొండా రాజ్యలక్ష్మి(35) కుర్చీలాట పోటీల్లో పాల్గొంది. కొద్దిసేపు ఆడిన తరువాత ఒక్కసారిగా కూలపడిపోయింది. దీంతో స్థానికులు స్పందించి 108 వాహనంలో చికిత్సకోసం గుంటూరు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు వాహన సిబ్బంది తెలిపారు. గుండెకు సంబంధించి అస్వస్థతకు లోనయి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. కాగా మృతురాలి భర్త సాంబిరెడ్డి పొలం పనులు చేస్తుంటాడు. మృతురాలికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

ఆ ఇంట ప్రతిభ కొలువు

- ఇంజినీరింగ్ విద్యార్థులైన కవలల ప్రతిభ అద్భుతం
- అక్కకు రూ.40 లక్షల వేతనంతో అమెజాన్‌లో ఉద్యోగం
- తమ్ముడికి రూ.7 లక్షలతో టీసీఎస్‌లో కొలువు
- అవధుల్లేని తల్లిదండ్రుల ఆనందం

తెనాలి: ప్రతిభ కలిగి తగిన నైపుణ్యాలు కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు తలుపులు తెరిచే ఉంచుతున్నాయ్... అదనంగా సర్టిఫికేషన్ కోర్సులు అర్హత కలిగినవారికి రెడ్‌కార్పెట్ పరుస్తున్నాయంటే అతిశయోక్తి లేదు. 'అంతకుమించి'న ప్రతిభావంతులను ఏకంగా అమెజాన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు ఆహ్వానిస్తున్నాయి. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ బి.రేణుఅక్షయ, ఆమె సోదరుడు రోహిత్ ఇందుకో నిదర్శనం. నేటితరం కలలు కనే వార్షిక ప్యాకేజీతో వాళ్లు కార్పొరేట్ కొలువులకు ఎంపికయ్యారు.



తల్లిదండ్రులు బి.రాజీవ్, పద్మావతి

'అమ్మో'జాన్.. అనిపించేలా..



పట్టణానికి చెందిన బి.రేణుఅక్షయ, రోహిత్‌లు కవలలు. స్వల్ప సమయం తేడాతో అక్కాతమ్ముడు. ఇద్దరూ విజ్ఞాన్ లారాలో ఇంజినీరింగ్ (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్) చేశారు. రేణుఅక్షయ ప్రఖ్యాత అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. వార్షిక వేతనం రూ.40 లక్షలు. నాలుగు రౌండ్ల వారీగా జరిపిన ఇంటర్వ్యూల్లో నెగ్గి ఈ అవకాశాన్ని అందుకున్నారు. ఫిబ్రవరి 17వ తేదీన బెంగళూరులో విధుల్లో చేరనున్నారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలోనే అమెజాన్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు అక్షయ దరఖాస్తు చేశారు. అప్పట్లో కరోనా విపత్కర పరిస్థితుల్లో అది పెండింగులో ఉండిపోయింది. అమెజాన్ కంపెనీ ఆఫర్ లెటర్‌లో కంపెనీ ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ, అభినందించటం విశేషం!

- 2024 వేసవికి ఇంజినీరింగ్ పూర్తిచేసిన రేణుఅక్షయ, ఫైనలియర్ జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అమెజాన్‌తో సహా మొత్తం ఆరు కంపెనీల్లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. వీటిల్లో టీసీఎస్, టెక్ మహేంద్ర, యాక్సెంచర్, ప్రొలిఫిక్స్, టాలెంట్ సర్వ్ కంపెనీలున్నాయి. అమెజాన్ వంటి సంస్థలో ఉద్యోగం చేయాలన్న భావనతో అక్షయ, వారు జరిపిన వివిధ రౌండ్ల ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కొని తన లక్ష్యాన్ని అందుకున్నారు. ఇంటర్‌వరకు తెనాలిలోనే చదివిన రేణుఅక్షయ టెన్త్‌లో 10 జీపీఏతో ఉత్తీర్ణురాలు కాగా, ఇంటర్‌లో 961/1000 మార్కులు సాధించింది.

ప్రతిభలో రో'హిట్'..



రేణు అక్షయ కవల సోదరుడు రోహిత్. అక్కతోపాటు అదే తరగతిలో చదువుతూ వచ్చాడు. టెన్త్‌లో 9.3 జీపీఏతో ఉత్తీర్ణతను సాధించాడు. ఇంటర్‌లో 841/1000 మార్కులు సాధించాడు. విజ్ఞాన్ లారాలోనే ఇంజినీరింగ్ (సీఎస్ఈ) చదివాడు. 2024లో క్యాంపస్ ఇంటర్వ్యూలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్ డిజిటల్‌కు ఎంపికయ్యాడు. టీసీఎస్ కంపెనీ ఇప్పుడు అపాయింట్‌మెంట్‌ను పంపింది. ఈనెల 30వ తేదీన టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ కొలువులో కుదురుకోనున్నాడు. కంప్యూటర్ ప్రతిభావంతులైన రేణుఅక్షయ, రోహిత్‌ల తండ్రి డాక్టర్ బి.రాజీవ్ స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో కామర్స్ అధ్యాపకుడిగా 1998 నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కామర్స్ విభాగం అధిపతిగా ఉన్నారు. కవల బిడ్డలైన ఇద్దరూ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు కావటం, ఒకేసారి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల్లో చేరనుండటంపై వీరి సంతోషం అంతాఇంతా కాదు. బిడ్డలు ఉన్నతస్థాయికి చేరటాని కన్నా మించిన సంతోషం తల్లిదండ్రులకు మరేముంటుంది.

హోరాహోరీగా ఎడ్ల పూటీలాగుడు పోటీలు

ద్వితీయస్థానం సాధించిన గుంటూరు జిల్లా ఎడ్లు



రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన పల్లెబోయిన సంతోష్ రెడ్డి ఎడ్ల జత

ఘంటసాల: సంక్రాంతి పండుగ సందర్భంగా డాక్టర్ గొర్రెపాటి నవనీతకృష్ణ మెమోరియల్ వారి ఆధ్వర్యంలో ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభ రాజాల నాటుబండి పోలు రాధాడి రాష్ట్రస్థాయి పూటీలాగుడు బల ప్రదర్శనలో భాగంగా బుధవారం జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో 11 ఎడ్ల జతలు పాల్గొనగా నెల్లూరు జిల్లా అల్లూరు మండలం తూర్పు గోగులపల్లి గ్రామానికి చెందిన పల్లెబోయిన సంతోష్ రెడ్డి ఎడ్ల జత 2.5 క్వింటాళ్ల బరువును 10 నిమిషాల్లో 2,824.9 అడుగుల దూరం లాగి మొదటి స్థానం సాధించింది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 2,783.2 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్ల సురేష్ బాబు ఎడ్లజత 2,700 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. గెలుపొందిన ఎడ్ల జత యజమానులకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి చేతుల మీదగా మొదటి బహుమతి రూ.50 వేల నగదు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.40 వేలు, రూ.30 వేలు అందించారు. నాల్గవ, ఐదో, ఆరో స్థానాల జతలకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, ఏడో స్థానం సాధించిన జతకు ప్రత్యేక బహుమతితో పాటు పాల్గొన్న 11 ఎడ్ల జత యజమానులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, పూటీలాగుడు ప్రదర్శన కమిటీ సభ్యులు బండి పరాత్పరరావు, వేమూరి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో 'డాకు మహారాజ్' బృందం సందడి

చిత్రాన్ని వీక్షించిన చిత్ర దర్శకుడు, సంగీత దర్శకుడు



ప్రేక్షకులతో దర్శకుడు బాబి, సంగీత దర్శకుడు తమన్

నగరంపాలెం: డాకు మహారాజ్ చిత్ర దర్శకుడు బాబీ కొల్లి, సంగీత దర్శకుడు ఎస్.తమన్ సందడి చేశారు. కనుమ పండుగ సందర్భంగా బుధవారం గుంటూరు నగరంపాలెంలోని ఫినిక్స్ మాల్‌కు చిత్ర బృందం విచ్చేశారు. వారికి థియేటర్, ఫుడ్‌కోర్టు యాజమాన్యం స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు ప్రదర్శితమైన డాకు మహారాజ్ చిత్రాన్ని ప్రేక్షకులతో కలసి వీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. దర్శకుడు బాబి మాట్లాడుతూ ప్రేక్షకులు చిత్రానికి ఘన విజయం అందించారని అన్నారు. అన్ని హంగులతో చిత్రాన్ని నిర్మించామని, ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నారని చెప్పారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ సంగీతపరంగా మంచి విజయాన్ని అందించారని పేర్కొన్నారు. అనంతరం విజయోత్సవ కేక్‌ను కట్ చేశారు. ఫుడ్ కోర్ట్ యాజమాన్యం దాసరి శ్రీకాంత్, కడంశెట్టి సతీష్, గ్రంధి వెంకటేష్ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఆగిన పసిగుండె

- వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందని ఆరోపణలు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తల్లిదండ్రులు
- లేకలేక పుట్టిన బిడ్డను చంపేసి, తీరా క్యాన్సర్ అంటున్నారని ఆవేదన



మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద కేసు పెట్టేందుకు వచ్చిన పాప తల్లిదండ్రులు



చిన్నారి తన్విశ్రీ (ఫైల్)

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ పాప చనిపోయిందంటూ బుధవారం తల్లిదండ్రులు మంగళగిరి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. బాధితుల కథనం.. సేకరించిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన కొత్తం గంగరాజు, కుమారి దంపతులకు పెళ్లయిన ఆరు సంవత్సరాల తరువాత పాప జన్మించింది. ఆ పాపకు తన్విశ్రీ (14 నెలలు) అని పేరు పెట్టుకున్నారు. పాప ఇంటి దగ్గర ద్విచక్ర వాహనం పై నుంచి కిందపడి మెడలోపలి భాగంలో స్వల్పగాయమైంది. లేకలేక పుట్టిన బిడ్డకు దెబ్బ తగలడంతో తల్లిదండ్రులు స్థానిక కార్పొరేట్ ఆసుపత్రిలో చూపించగా, వారు మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తీసుకువెళ్లమని సూచించడంతో గత మూడు రోజుల క్రితం ఎయిమ్స్‌కు తీసుకువచ్చారు. సోమవారం ఎయిమ్స్‌కు రాగా వైద్యులు పరీక్షించి రెండు సిరప్‌లు ఇచ్చి, ఇంటికి వెళ్లి బుధవారం రమ్మని చెప్పారు. పాపకు దెబ్బతగిలినా ఆడుకుంటూ నవ్వుతూ ఉండేదని తల్లిదండ్రులు తెలిపారు. అయితే బుధవారం మళ్లీ ఆస్పత్రికి రాగా పాపకు స్కానింగ్ తీయాలని చెప్పి లోపలికి తీసుకు వెళ్లారు. తొలుత స్కానింగ్ తీసి, అనంతరం ఎంఆర్ఐ స్కానింగ్ అంటూ పాపకు మత్తు ఇచ్చారని తల్లిదండ్రులు తెలిపారు. రెండు మూడు సార్లు స్కానింగ్ తీసినా సరిగా రాకపోవడంతో మళ్లీ పాపకి మత్తు ఇంజక్షన్ ఇచ్చారని, అరగంట తరువాత పాప స్కానింగ్ మిషన్‌లోనే చనిపోయిందని చెబుతున్నారని, క్యాన్సర్ అని వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పాప చనిపోకముందు జూనియర్ డాక్టర్లు వైద్యం అందించగా, పాప మృతితో సీనియర్ వైద్యులు వచ్చి పరిశీలించి చనిపోయిందని నిర్ధారించారు. అప్పటివరకు ఆడుతూ పాడుతూ ఉన్న పాప ఎలా చనిపోయిందని అడగడంతో డాక్టర్లు మాకు తెలియని భాషలో ఏదేదో చెబుతూ మమ్మల్ని బయటకు వెళ్లమని చెప్పారని తల్లిదండ్రులు ఇద్దరూ పోలీస్‌స్టేషన్ ముందు కన్నీరు మున్నీరుగా విలపించారు. అసలు ఏ పరీక్షలు చేయకుండా క్యాన్సర్ అని ఎలా నిర్ధారించారో తమకు తెలియజెప్పాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశామని, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తండ్రి గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సామాజిక మాధ్యమాల్లో ఎయిమ్స్ హాస్పిటల్‌లో పాప ఎవరూ చనిపోలేదని, ఇలాంటి సంఘటనలు ఎవరూ నమ్మవద్దని ప్రచారం నిర్వహిస్తున్నారు. జరిగిన ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దళితుల ఇళ్లు కూల్చివేత దారుణం

క్రోసూరు:పిడుగురాళ్లలో దళితుల ఇళ్లను కూల్చిన మద్దాల సుబ్బయ్యపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ బుధవారం డిమాండ్ చేసింది. క్రోసూరులో కమిటీ సభ్యులు గార్లపాటి దాసు, బంకా శ్రీనివాసరావు, పట్టిపు మరియదాసు విలేకరులతో మాట్లాడారు. 1996లో ప్రభుత్వం కొమ్ము కోటిరత్నానికి 14.5 సెంట్ల స్థలాన్ని ఇచ్చింది. దాన్ని గతంలో చల్లా సీతారామిరెడ్డి కబ్జా చేసేందుకు యత్నించగా హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ద్వారా కోటిరత్నం కుమారుడు ఆనందరావు తన తల్లి పేర డిక్రీ తెచ్చుకున్నారు. ఉత్తర్వుల కాపీని అప్పటి ఆర్డీవోకు, తహశీల్దార్‌కు అందించారు. ఆ స్థలంలో ఆనందరావు సహా ఏడు కుటుంబాలు సిమెంట్ బ్రిక్స్ తయారీతో పాటు హోటల్ పెట్టుకుని జీవిస్తున్నారు. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి మద్దాల సుబ్బయ్య అనే వ్యక్తి 40 మంది మనుషులతో వచ్చి దాడి చేసి, తీవ్రంగా కొట్టారు. ఇళ్లను పడేసి, ఆర్థికంగా రూ.50 లక్షల ఆస్తి నష్టపరిచాడని కమిటీ సభ్యులు తెలిపారు. సుబ్బయ్యపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గృహాలు మంజూరు చేసి, నిందితుడితో బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గణతంత్ర దినోత్సవ పెరేడ్‌కు ఎన్‌సీసీ విద్యార్థులు



నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ పెరేడ్‌కు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ తెలిపారు. కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న కె.హరీష్, కె.కావేరి, ఏ.అర్తి, డి.అప్పలనాయుడు ఈనెల 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అర్హత సాధించినట్టు వివరించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వర రావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు.

చీటింగ్ కేసులో యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బ్రహ్మయ్య

సత్తెనపల్లి: ఉద్యోగాలు ఇప్పిస్తానని చీటింగ్ చేసే యువకుడ్ని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి వివరాలను పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య వెల్లడించారు. వివరాలు ఇలా...చిత్తూరు జిల్లా సోమల మండలం తప్పన్నగారిపల్లి గ్రామానికి చెందిన అమాస భాను అలియాస్ పవన్ అలియాస్ రాజేష్ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. సులభ మార్గంలో డబ్బు సంపాదించేందుకు మోసాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో గతంలో రాజకీయ నాయకుల వద్ద పీఏగా పని చేశానని పలువురిని నమ్మించాడు. చాలా మంది నాయకులు తెలుసని, ఆ పలుకుబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసాలు చేయడం ప్రారంభించాడు. అతనిపై చిత్తూరు జిల్లాలోనే పలు కేసులతో పాటు ఓ హత్య కేసులో చిత్తూరు జిల్లా సోమ్లా పోలీస్‌స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకి పంపారు. బెయిల్‌పై విడుదలై బయటకు వచ్చినా కూడా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. మళ్లీ గతంలో మాదిరిగానే ఉద్యోగాలను ఇప్పిస్తానని చీటింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్న పల్నాడు జిల్లా గండ్లూరుకు చెందిన 2వ నిందితుడు నాగమల్లేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. అతని సహకారంతో సత్తెనపల్లి నియోజక వర్గంలోని రాజకీయ వాట్సప్ గ్రూప్‌లలో ఉన్న సభ్యుల ఫోన్ నంబర్లను సేకరించాడు. వారికి ఫోన్లు చేసి రాజమండ్రి, తిరుపతి, రేణుగుంట ఎయిర్ పోర్టులలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఆన్‌లైన్ ద్వారా నగదు వేయించుకొని ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతనిపై సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. వాహనాల తనిఖీలు చేస్తుండగా అమాస భాను సత్తెనపల్లిలోని నరసరావుపేట రోడ్‌లో గల చెక్ పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా సీఐ బ్రహ్మయ్య మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తానంటే నమ్మవద్దని తెలిపారు. సమావేశంలో సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రునయనాలతో డీఎస్పీ అంతిమయాత్ర

సంతాపం తెలిపిన ఎస్పీ తుషార్ డూడీ



రత్తయ్య (ఫైల్)



పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

యద్దనపూడి: యద్దనపూడి మండలం సురవరపల్లిలో బుధవారం పోలీసు లాంఛనాలతో డీఎస్పీ రత్తయ్య అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు అధికారులు రత్తయ్య పార్థివదేహానికి పూలమాలలు వేశారు. శవపేటికను భుజాలపై ఎత్తుకొని అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎస్పీ తుషార్ డూడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సమర్థంగా విధులు నిర్వహించే రత్తయ్య అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సాధారణ రైతు కుటుంబం నేపథ్యం

యద్దనపూడి మండలం సురవరపల్లెలో సాధారణ రైతు కుటుంబంలో మద్దులూరి ఇజ్రాయిల్, శాంతమ్మ దంపతులకు జన్మించిన రత్తయ్య 1995లో గుంటూరు రేంజ్ ఎస్ఐగా ఉద్యోగం సాధించారు. నెల్లూరు జిల్లా వాకాడ పోలీస్ స్టేషన్‌లో మొదట పోస్టింగ్ విధులు నిర్వహించారు. 2009లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది నెల్లూరు పల్నాడు జిల్లాలో విధులు నిర్వహించారు. 2024లో సెప్టెంబరులో డీఎస్పీగా పదోన్నతి పొంది ప్రస్తుతం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా డయాలసిస్ చేయించుకుంటూ బాధపడుతున్న రత్తయ్య గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ జనవరి 13న తుది శ్వాస విడిచారు. అంతిమ యాత్రలో చీరాల డీఎస్పీ మొయిన్, యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి, ఇతర పోలీస్ అధికారులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

గురజాల: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గురజాల నగర పంచాయతీ జంగమహేశ్వరపురానికి చెందిన చెన్నారెడ్డి బృందావనం గార్డెన్స్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై గురజాల పట్టణానికి బయలుదేరారు. ఈ సమయంలో ఎదురుగా గురజాల నుంచి అంబాపురం వెళ్తున్న ద్విచక్ర వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో చెన్నారెడ్డి తల డివైడర్‌కు తగిలింది. 108 వాహనం ద్వారా పిడుగురాళ్ల వైద్యశాలకు తరలించారు.అక్కడే చికిత్స పొందుతూ చెన్నారెడ్డి మృతి చెందారు. దీనిపై గురజాల పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

దొంగలు హల్‌చల్



నడికుడిలో చోరీ జరిగిన ఇంటి వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు



గురజాలలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ వినోద్‌కుమార్

దాచేపల్లి: కనమ పండుగ రోజు దొంగలు హల్‌చల్ చేశారు. బుధవారం తెల్లవారు జామున తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడి, దాచేపల్లి మండలం శ్రీనివాసాపురంలో ఏడు ఇళ్లల్లో చొరబడి నగదు, బంగారం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో నివాసం ఉంటున్న షేక్ రహీం హైదరాబాద్‌లో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు రహీం ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాను తెరచి, అందులో భద్రపరచిన రూ.45వేలతో పాటు 400 గ్రాముల వెండిని చోరీ చేశారు. రహీం ఇంటి పక్కనే ఉన్న సయ్యద్ సైదా కొత్తపుల్లారెడ్డి గూడేనికి కుటుంబ సభ్యులతో వెళ్లారు. ఆయన ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.2లక్షలతో పాటు నాలుగు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. రైల్వేలో లోకో పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్న మొగిలి ఆశోక్ తెలుకుట్లకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి తులం బంగారం, రెండు తులాల వెండిని దొచుకున్నారు. ఆ తర్వాత కోటేశ్వరరావు ఇంట్లోకి చొరబడిన దుండగులు ఏమి తీసుకెళ్లలేదు. శ్రీనివాసపురంలో హరిదాసు రామకృష్ణా తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో పిడుగురాళ్లలో ఉన్నారు. ఆయన ఇంట్లోకి దుండగులు ప్రవేశించి రూ.1.80లక్షల నగదుతో పాటు రూ.1.70లక్షలు విలువ చేసే బంగారం, వెండి వస్తువులు దోచుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన ఏపూరి నర్సమ్మ కుమార్తె ఇంటి వద్ద నిద్రించింది. దుండగులు ఆమె ఇంట్లోకి ప్రవేశించి రూ.30వేలను దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. సంఘటన స్థలాలను సీఐ భాస్కర్, ఎస్ఐలు పాపారావు, సౌదర్యరాజన్ పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. క్లూస్‌టీం బృందం, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

గురజాల: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా ఎంచుకుని దొంగలు ఒక్కసారిగా రెచ్చిపోయారు. రెండు రోజులుగా రెక్కీ నిర్వహించి, బుధవారం తెల్లవారుజామున తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలతో పాటు లాకర్లను సైతం పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. గురజాలలోని వికలాంగుల కాలనీలో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాలోని వస్తువులను కింద పడవేశారు. మండల పరిధిలోని పులిపాడులో ఐదు ఇళ్లలోకి ప్రవేశించడంతో పాటు ఒక దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డారు. చోరీ జరిగిన ఇళ్లను డీఎస్పీ జగదీష్, సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై. వినోద్‌కుమార్ పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. దొంగతనంలో ఎంత మంది పాల్గొన్నారు.. దోచుకెళ్లిన డబ్బులు.. బంగారు ఆభరణాల గురించి తెలుసుకుంటున్నారు. ఒకే సమయంలో దొంగతనాలు జరగడంతో పోలీసులకు సవాల్‌గా మారాయి.

యథేచ్ఛగా మద్యం అమ్మకాలు



పల్లెకోనలోని కోడి పందేలు బరిలో మద్యం అమ్మకాలు

చుండూరు(వేమూరు): సంక్రాంతి సంబరాల మాటున వేమూరు నియోజకవర్గంలో కోడి పందేల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. పేకాట, మద్యం ఏరులై పారింది. మద్యం ఇష్టారాజ్యంగా అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించు కోలేదు. వాస్తవానికి మద్యం షాపుల్లోనే అమ్మకాలు చేయాలి. నిబంధనలను పక్కన పెట్టి బరుల్లో బెల్టు షాపులు జోరుగా నిర్వహించారు. వేమూరు మండలంలోని జంపనిలో ఏకంగా పందేల దగ్గర రెండు బెల్టు షాపులు ఏర్పాటు చేసి జోరుగా మద్యాన్ని అమ్మారు. కొల్లూరు మండలంలోని క్రాప వద్ద, భట్టిప్రోలు మండలంలోని పల్లెకోనలో బరుల వద్ద బెల్టు షాపులు నిర్వహించారు. చుండూరు మండలంలోని కోడి పందేలు బరిలో మద్యం అమ్ముతున్నా అధికారులు పట్టించు కోలేదు.

జూదగాడిపై దాడి..

దొంగ ముక్కలతో పేకాడుతున్న వ్యక్తికి దేహశుద్ధి

దొంగ ముక్కలతో పేకాడుతున్న వ్యక్తికి దేహశుద్ధి చేశారు. చుండూరు మండలంలోని కేఎస్ పల్లి బరి దగ్గర దొంగ ముక్కలతో పేకాడుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. బరి దగ్గర ఇష్టారాజ్యంగా కొట్టారు. తర్వాత ఆటోలో వేటపాలెం తీసుకెళ్లి అక్కడ కూడా కొట్టారు. గ్రామస్తులు 100 కాల్ ఫోన్ చేయడంతో చుండూరు పోలీసులు హడావుడిగా సంఘటన స్థలం వద్దకు చేరుకుని దాడిని ఆపారు. పేకాటలో తప్పు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, దాడి చేయకూడదని తెలిపారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ షేక్ రహిమాన్ తెలిపారు.